సాక్షి
కర్నూలు

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలం: శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండి రథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



ముగ్గురిపై వేటు

జూపాడుబంగ్లా గురుకుల విద్యార్థి మృతి ఘటనలో పాఠశాలకు చెందిన ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడింది. అధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.

8లో



హైవేపై కారు దగ్ధం

నంద్యాల(రూరల్):రైతునగర్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం ఓ కారులో మంటలు వ్యాపించాయి. అందులో ఉన్న వారు దిగిన తర్వాత మంటలు ఎగసిపడి కారు దగ్ధమైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా మురళీకృష్ణ



కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా (కర్నూలు, నంద్యాల జిల్లాలు) పరిగల మురళీకృష్ణ నియమితులయ్యారు. కోడుమూరు మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన ఈయనకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ అధిష్టానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చైర్మన్‌గా ఎస్.ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంతో పాలక వర్గం కొనసాగుతోంది. ఈ పాలక వర్గం పదవీ కాలం ఈ నెల 24తో ముగియనుండగా.. ఈ నెల 25 నుంచి ఆరు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు ప్రభుతం జీఓ ఆర్‌టీ నెం.286 జారీ చేసింది.

గూడూరు కమిషనర్‌గా ఎస్.ప్రసాద్‌గౌడ్



కర్నూలు(టౌన్): గూడూరు కమిషనర్‌గా ఎస్.ప్రసాద్‌గౌడ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేస్తున్న జి.శ్రీనివాసులును గుత్తి మున్సిపాలిటీకి బదిలీ చేసింది. కమిషనర్‌గా నియమితులైన ప్రసాద్‌గౌడ్ నగరపాలక ఇంజనీరింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. దీర్ఘకాలంగా నగరపాలకలో పనిచేసే పలువురు సీనియర్ సూపరింటెండెంట్లు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఖాళీగా ఉన్న కమిషనర్ పోస్టుల బదిలీకి నిర్ణయించింది. ఆ మేరకు ఇటీవల సీనియర్ సూపరింటెండెంట్ల అంగీకార పత్రాలు(విల్లింగ్) తీసుకున్న ప్రభుత్వం కమిషనర్‌లుగా నియమించింది. సోమవారం మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు పి.కోటేశ్వరరావు నియమాక ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐడీ అడిషనల్ డీజీని కలసిన ఎస్పీ



కర్నూలు: కర్నూలులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయ పరిశీలనకు వచ్చిన సందర్భంగా బి.క్యాంప్‌లోని పోలీసు అతిథిగృహంలో సీఐడీ అడిషనల్ డీజీ సంజయ్‌ని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో సంజయ్ జిల్లా ఎస్పీగా పనిచేసినందున అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రస్తుతం జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితులపై కొద్దిసేపు వారు చర్చించుకున్నారు.


సీఐడీ ప్రాంతీయ కార్యాలయం తనిఖీ

కర్నూలు వెంకటరమణ కాలనీలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆ విభాగం అడిషనల్ డీజీపీ నడిగట్టు సంజయ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌చార్జి రీజనల్ ఆఫీసర్ సి.శ్రీనివాసులు, సీఐడీ డీఎస్పీ దైవప్రసాద్, ఏసీబీ డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు శ్రీనాథ్‌రెడ్డి, దేగల ప్రభాకర్ తదితరులు స్వాగతం పలికారు. ఆఫీస్ నిర్వహణకు సంబంధించిన అవసరాలు, సిబ్బంది సంక్షేమం, కేసుల విచారణపై చర్చించారు.

కాసుల క్లాసులు!

సెలవుల్లోనూ తరగతుల నిర్వహణ

- బరితెగించిన కార్పొరేట్ కళాశాలలు
- ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు బేఖాతరు
- ఫీజుల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- చూసీచూడనట్లుగా అధికారులు
- ఫిర్యాదులు చేస్తే నోటీసుల పేరిట హడావుడి



కార్పొరేట్ కళాశాలలు తెలివిమీరి పోయాయి. చదువుల విషయం పక్కనపెడితే.. ఫీజులు వసూలు చేసుకునేందుకు విద్యార్థుల సెలవులను ఫణంగా పెడుతున్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు అయ్యాయో, లేదో.. వారం రోజులు గడవక మునుపే తల్లిదండ్రులకు ఫోన్లు. కళాశాల ప్రారంభమైందని, క్లాసులకు రాకపోతే సిలబస్‌లో వెనుకబడిపోతారనే భయం పెట్టడంతో దిక్కుతోచని స్థితి ఎదురవుతోంది. పిల్లలకు ఇష్టం లేకపోయినా, తల్లిదండ్రులకు మనసొప్పకపోయినా కళాశాలకు సిద్ధం చేస్తుండటం గమనార్హం.

కర్నూలు సిటీ: వేసవి సెలవులు వచ్చేశాయనే ఆనందం ఆవిరైంది. తల్లిదండ్రులతో కలిసి అవ్వాతాత ఊరికి వెళ్లాలని.. కాంక్రీటు వనాల నుంచి పల్లెటూరుకు వెళ్లి చెట్టూకొమ్మను పలకరించాలని, సెలయేళ్లలో ఈతకొట్టాలని.. బంధువులతో మాటామంతీ కలపాలని.. చిన్ననాటి స్నేహితులతో ఆడిపాడాలనే ఆశ చెదిరిపోయింది. ర్యాంకుల వేటలో తమ పిల్లలు ముందుండాలనే భావన.. కార్పొరేట్ కాలేజీల ధన దాహానికి పిల్లల వేసవి సరదా కాస్తా క్లాసు రూంలలో మగ్గిపోతోంది. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు వార్షిక పరీక్షలు ముగిసిన తరువాత ఫలితాలు వచ్చి పై తరగతులకు వెళ్లే వరకు ఎండల తీవ్రత దృష్ట్యా వేసవి సెలవులను ప్రకటించడం సర్వ సాధారణం. విద్యా సంవత్సరం ప్రారంభ తేదీని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రకటించే వరకు ఎలాంటి అడ్మిషన్స్ కానీ, పై తరగతులకు సంబంధించి పాఠ్యాంశాల బోధన కూడా చేయకూడదని అధికారులు స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ జిల్లాలో కార్పొరేట్, సెమి కార్పొరేట్ కాలేజీల యజమాన్యాలు బోర్డు ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి. పరీక్షలు ముగిసిన వారం రోజుల్లోనే మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన వారికి ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన తరగతులను బోధిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్‌తో టెస్ట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సైతం మొదటి సంవత్సరం పాఠ్యాంశాల బోధనకు తరగతులు నిర్వహిస్తున్నారు. మరికొంత మంది ఆన్‌లైన్‌లో తరగతులు కొనసాగిస్తున్నారు.

తరగతుల మాటుల ఫీజుల బాగోతం

కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల మీద ప్రేమతో తరగతులు నిర్వహిస్తున్నట్లు పైకి ప్రచారం జరుగుతున్నా.. లోపల ఫీజుల బాగోతం కనిపిస్తోంది. మొదటి సంవత్సరం పూర్తయిన విద్యార్థులు, రెండో సంవత్సరం ఆ కళాశాలలోనే చదివేలా జాగ్రత్త పడుతున్నారు. ఇందులో భాగంగానే కొంత ఫీజు కట్టించుకుంటే ఇక ఎక్కడికీ పోరనే భావనతో క్లాసులను తెర మీదకు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.



కర్నూలులోని ఓ కార్పొరేట్ కళాశాలలో తరగతులకు హాజరైన ఇంటర్మీడియట్ విద్యార్థినులు

రోజురోజుకూ ఎండల తీవ్రత

మే నెలకు ముందే వేసవి తీవ్రత రోజు రోజుకూ తీవ్రమవుతోంది. ఇప్పటికే ఉష్ణోగ్రత పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలను దాటడం ఆందోళన కలిగిస్తోంది. అక్కడక్కడ వడదెబ్బ మరణాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కనీసం బయట తిరిగేందుకు కూడా ప్రజలు జంకుతున్న పరిస్థితుల్లో కార్పొరేట్ కళాశాలల సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తుండటం గమనార్హం.

ఫిర్యాదులు చేసినా..

తరగతుల నిర్వహణ, ఫీజుల వసూలుపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. క్లాదుటే విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నా.. కళాశాలలు తెరిచి ఉంచినా అధికారులు తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ ఫిర్యాదులను పరిశీలిస్తే నోటీసుల పేరిట హడావుడి చేసినా, ఆ తర్వాత షరామామూలుగా మిన్నకుండిపోతున్నారు.

సెలవుల్లో తరగతులు.. పట్టించుకోని ఇంటర్ బోర్డు

జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యను అందిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు మొత్తం 74 వరకు ఉన్నాయి. ఇందులో కార్పొరేట్ కాలేజీలు సుమారు 18. మొదటి సంవత్సరం పరీక్షలు గత నెల 15న మొదలై, ఈ నెల 4వ తేదీ వరకు నిర్వహించారు. అయితే పరీక్షలు రాసిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం క్లాసులు, ద్వితీయ సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు కోచింగ్ క్లాసులు నిర్వహిస్తూ కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకుండా తరగతులు నిర్వహిస్తున్నా.. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం అడుతున్నా ఇంటర్ బోర్డు అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు



ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల మొదటి వారంలో ముగియగా మూల్యాంకనం పూర్తయింది. జూనియర్ కాలేజీలన్నింటికీ వేసవి సెలవులు ప్రకటించారు. ఈ సమయంలో ఎలాంటి తరగతులు నిర్వహించరాదు. అలా ఎవరైనా తరగతులు నిర్వహిస్తుంటే చర్యలు తప్పవు. ఫిర్యాదు చేసినా కఠినంగా వ్యవహరిస్తాం. తనిఖీలు చేసి నోటీసులు ఇస్తాం.

– ఎస్.వి.ఎస్ గురవయ్య శెట్టి, ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి

బయో ఉత్పత్తుల విక్రయానికి అనుమతులు

కర్నూలు(అగ్రికల్చర్): బయో ఉత్పత్తుల విక్రయానికి 47 కంపెనీలకు అనుమతి ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. బయో ఉత్పత్తుల విక్రయానికి సంబంధిత కంపెనీలు ఫామ్–జి ద్వారా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వీటిని పరిశీలించిన తర్వాత కమిషనర్ ఫామ్–జి2 ద్వారా అనుమతులు ఇస్తారు. ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ కమిషనర్ 47 కంపెనీలకు చెందిన 622 బయో ఉత్పత్తులకు ఫామ్–జి2 ద్వారా అనుమతులు ఇచ్చారు. ఇతర జిల్లాలకు చెందిన వారు ఫామ్–జి2 అనుమతులు పొంది ఉంటే ఇక్కడ మార్కెటింగ్ చేసుకునేందుకు తగిన అనుమతులు పొందాలని వ్యవసాయ అధికారులు సూచించారు. అనుమతించిన బయో ఉత్పత్తులను అమ్ముకునేందుకు 2024 ఫిబ్రవరి 22 వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. కోర్టు ఆర్డర్లు ఇప్పుడు చెల్లుబాటు కావని అధికార వర్గాలు వెల్లడించాయి.

విత్తన తనిఖీలకు ఇంటర్నల్ స్క్వాడ్

- మే నెల 15లోగా తనిఖీల పూర్తికి ఆదేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజీ గోదాములు, ట్రాన్స్‌పోర్టు సంస్థలు, విత్తన దుకాణాల్లో తనిఖీల నిర్వహణకు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఇంటర్నల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో వ్యవసాయ శాఖ విత్తనాలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అంతర్గత తనిఖీ అధికారులను నియమించారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డిని ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీని ఆదోని సబ్ డివిజన్‌కు, ఆదోని ఏడీఏ ఎం.గిరీష్‌ను కర్నూలు సబ్ డివిజన్‌కు, పత్తికొండ ఏడీఏ మోహన్ విజయకుమార్‌ను ఆలూరు సబ్ డివిజన్‌కు, ఆలూరు ఏడీఏ సునీతను పత్తికొండ సబ్ డివిజన్‌కు ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులుగా నియమించారు. మే నెల 15వ తేదీలోగా తనిఖీలు పూర్తి చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ వైపే ప్రజల మొగ్గు

- వచ్చే ఎన్నికల్లో తిరిగి టీడీపీకి బుద్ధి చెప్పడం ఖాయం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి గుమ్మనూరు

ఆలూరు: సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ వైపే ప్రజలు ఉన్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు..మెగా పీపుల్స్ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా కోటి కుటుంబాలు పాల్గొన్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం మంత్రి స్వగ్రామమైన చిప్పగిరి మండలం గుమ్మనూరులో పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈనెల7వ తేదీన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభమైందని, రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో పీపుల్స్ మెగా సర్వేను నిర్వహించారన్నారు. ఈ సర్వేలో 7 లక్షల మంది కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి నియోజకవర్గం ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు అభిప్రాయాన్ని వెల్లడించారన్నారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో లక్షకుపైగా ఇల్లు ఉండగా ఇప్పటి వరకు 60 వేల ఇళ్లలో సర్వే పూర్తయిందన్నారు. ఈనెల 29వ తేదీలోగా మిగిలిన ఇళ్ల పూర్తి చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కుల, మతాలకు అతీతంగా అందరు ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో చిప్పగిరి సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లికార్జున, గుమ్మనూరు గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, పార్టీ నాయకులు శ్రీధర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన 26 అసిస్టెంట్ ప్రొఫెసర్(కాంట్రాక్ట్) పోస్టులను భర్తీ చేయనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వెంకట సుందరానంద పుచ్చా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ విభాగంలో 6, కంప్యూటర్ సైన్స్‌లో 9, ఈసీఈ విభాగంలో 5, ట్రిపుల్ ఈ(క్యాంపస్‌లో ఈ విభాగం లేకపోయినా ఓ సబ్జెక్టు అవసరాల రీత్యా) ఒక పోస్టు, ఇంగ్లిష్ సబ్జెక్టులో, గణిత విభాగంలో 2, ఫిజిక్స్‌లో 1 పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన ఒప్పంద అధ్యాపకులుగా భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నేటి(మంగళవారం) నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు స్వీకరించనున్నారు. పూర్తి వివరాలు, రోస్టర్ పాయింట్ల కోసం యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ www.ruk.ac.inలో చూసుకోవచ్చన్నారు.

సుస్థిర అభివృద్ధి ఎంతో అవసరం

- జిల్లాలోని పంచాయతీలు ఆదర్శంగా నిలవాలి
- పంచాయతీరాజ్ దినోత్సవంలో కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన
- వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, ఎమ్మెల్యే కాటసాని
- ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా కలెక్టర్ సృజన, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని తదితరులు

కర్నూలు(అర్బన్): గ్రామీణప్రాంతాలకు సుస్థిర అభివృద్ధి ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో ఉత్తమ పంచాయతీల్లోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జోనల్ ఇన్‌చార్జ్, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కుటుంబ పాలన స్థాయి నుంచి ప్రజాస్వామ్య స్థాయికి గ్రామాలు చేరుకోవడంతో అభివృద్ధి కార్యక్రమాలు పెరిగిపోయాయన్నారు. సర్పంచులు వారు చేసిన అభివృద్ధి పనులను సమావేశాల్లో తెలియజేసే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రగతి ఫలాలు ప్రజలందరికీ అందేవిధంగా ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రవేశపెట్టిందన్నారు. మెరుగైన జీవనోపాధి, సుపరిపాలన, స్వయం సమృద్ధి, మహిళా స్నేహ పూర్వకం..మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక సురక్షిత..తదితర తొమ్మిది అంశాల ఆధారంగా ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసినట్లు చెప్పారు. నంద్యాల జిల్లాలో 16, కర్నూలు జిల్లాలో 11 పంచాయతీలకు అవార్డులు వచ్చాయన్నారు.

మూడంచెల వ్యవస్థతో అభివృద్ధి

మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయిలో పాలకవర్గాలు ఉన్నందున ఆయా వ్యవస్థలు బలోపేతం అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిది అంశాలకు సంబంధించి ఢిల్లీలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు తాను హాజరైనట్లు చెప్పారు. గ్రామాభివృద్ధికి సంబంధించి సర్పంచులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే గ్రాంట్ల వైపే కాకుండా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ఆచరణలో పెట్టాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారందరికీ అందించేందుకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో పలు గ్రామాల్లోని వృద్ధులు తమకు బరిస్ పడకపోవడం వల్ల పెన్షన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చెత్త పన్నుపై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే జిల్లాలోని వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన కర్నూలు, పత్తికొండ డివిజినల్ పంచాయతీ అధికారులు తిమ్మక్క, శ్రీకాంత్‌చౌదరిలను జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు. జిల్లా కలెక్టర్ సృజనను జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణగిరి, కల్లూరు, ఓర్వకల్లు కర్నూలు, గూడూరు, సీబెళగల్ జెడ్పీటీసీ సభ్యులు కేఈ సుభాషిణి, ప్రభాకర్‌రెడ్డి, రంగనాథ్‌గౌడ్, ప్రసన్న కుమార్, మౌలాలి, గిరిజోస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ఆదోని ఎంపీడీఓ

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదోని ఎంపీడీఓ గీతావాణి రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. తొమ్మిది అంశాల్లో అభివృద్ధి లక్ష్యాలను సాధించిన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. సామాజిక భద్రతకు సంబంధించిన అంశానికి ఆదోని మండలం మండగిరి గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. మండగిరి పంచాయతీకి పాలకవర్గం లేకపోవడంతో ప్రత్యేకాధికారి పాలన సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకాధికారి హోదాలో ఆదోని ఎంపీడీఓ గీతావాణి పీఆర్అండ్ఆర్‌డీ కమిషనర్ ఏ సూర్యకుమారి చేతుల మీదుగా సన్మానం పొందారు.



గీతావాణిని సన్మానిస్తున్న పీఆర్ కమిషనర్



ఆదిత్యుడు అద్దిన అందాలు

నిటారుగా నిలిచి జీవకోటికి అభయమిస్తున్నట్లు కనిపించే హనుమ విగ్రహం ఒక వైపు..అరుణవర్ణంతో ఆకాశంలో పూర్ణ చంద్రుడి వలే సూరీడు ఇంకో వైపు.. సోమవారం సాయం సంధ్యవేళ కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై సుందర దృశ్యం కనువిందు చేసింది. కాన్వాస్‌పై చేయితిరిగిన చిత్రకారుడు గీసిన చిత్రంలా ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కర్నూలు మీదుగా ప్రత్యేక రైళ్లు

కర్నూలు(రాజ్‌విహార్): వేసవి సెలవుల కారణంగా కర్నూలు, డోన్ మీదుగా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే చర్యలు చేపట్టిందని చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సిహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ఏసీ, టూటైర్, త్రీటైర్, స్లీపర్ క్లాస్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ముందస్తు టిక్కెట్లు పొందేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

- మచిలీపట్నం–కర్నూలు(07067) రైలు: మే 2 నుంచి 29వ తేదీ వరకు ప్రతి శని, మంగళ, గురువారం.
- కర్నూలు నుంచి మచిలీపట్నం(07068) రైలు: మే 3 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి ఆది, బుధ, శుక్రవారం.
- ముజఫర్‌పూర్ నుంచి కర్నూలు, డోన్ మీదుగా యశ్వంత్‌పూర్‌కు(05271) ప్రత్యేక రైలు మే 5 నుంచి 26వ తేదీ వరకు ప్రతి శుక్రవారం.
- యశ్వంత్‌పూర్ నుంచి ముజఫర్‌పూర్‌కు(05272) ప్రత్యేక రైలు మే 8 నుంచి 29వ తేదీ వరకు ప్రతి సోమవారం.
- బరౌని నుంచి యశ్వంతపూర్‌కు(05215) ప్రత్యేక రైలు మే 6 నుంచి 27వ తేదీ వరకు ప్రతి శనివారం.
- యశ్వంత్‌పూర్ నుంచి బరౌనికి(05216) మే 9 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మంగళవారం.

సీమ సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం


మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ బాట పడతామని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో రాయలసీమ కర్తవ్య దీక్ష నిర్వహించారు. మాజీ మంత్రులు జేసీ దివాకర్‌రెడ్డి, శైలజానాథ్, మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి, ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, ప్రజా గాయకుడు గద్దర్, మాజీ ఎమ్మెల్యే ఎమ్.ఎ.గఫూర్ తదితరులు దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. బైరెడ్డి మాట్లాడుతూ అప్పర్ భద్ర కడితే కర్ణాటకలోని కొన్ని జిల్లాలు, రాయలసీమ ప్రాంతం పూర్తిగా ఎడారిగా మారుతుందన్నారు. రాయలసీమ సమస్యల పరిష్కారానికి త్వరలో సంతకాల సేకరణ ప్రారంభిస్తామన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీమ అభివృద్ధి చెందాలంటే కలసికట్టుగా ఉద్యమించాలన్నారు. మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ అప్పర్ భద్రను ఆపాల్సిందేనని.. కానీ దీన్ని ఆపలేరన్నారు.కార్యక్రమంలో కోట్ల హరిచక్రపాణిరెడ్డి, సీపీఐ నాయకులు రామచంద్రయ్య, విద్యా సంస్థల అధినేతలు జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యులు కుంచం వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం

- స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితుల్లో రీఓపెన్ కాకూడదు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి. సృజన


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): అర్జీదారుడు సంతృప్తి చెందేలా స్పందన కార్యక్రమానికి సమస్యలకు పరిష్కరాలు చూపాలని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క అర్జీ కూడా రీఓపెన్, రిజెక్షన్ కాకూడదని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య, సీపీఓ అప్పలకొండ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఎస్‌డీసీ రమ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా ఎవరి పరిధిలో వారు పరిష్కారాలు చూపాలన్నారు. అర్జీదారుల వినతులను ఆయా శాఖలకు గడువులోపు పంపాలని అధికారులను ఆదేశించారు.

'స్పందన' సమస్యల్లో కొన్ని...

☛ ప్రజలకు ఇబ్బందులు లేకుంటేనే సీసం రాయి పరిశ్రమకు అనుమతులు మంజూరు చేయాలని వెల్దుర్తి మండలం సర్పరాజపురం, ఎస్ బోయినపల్లె గ్రామ ప్రజలు లక్ష్మీనారాయణశెట్టి, శివరాజు, చాంద్‌బాష తదితరులు విన్నవించారు.

☛ తనకు వెల్దురి మండలం అల్లుగుండు గ్రామ పొలిమేరలో 1.70ఎకరాల భూమి ఉన్నదని, దానిని అదే గ్రామానికి చెందిన నారాయణ, సోమరఘురామయ్యలు ఆక్రమించుకున్నారని, న్యాయం చేయాలని వెల్దుర్తి బీసీ కాలనీకి చెందిన లక్ష్మిరెడ్డి కోరారు.

☛ నిరుద్యోగుల కోసం వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరుతూ బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి కలెక్టర్‌ను వినతిపత్రం ఇచ్చారు.

సచివాలయాల సేవలు పెరగాలి

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సేవలను పెంచాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాలపై మండలాధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు సచివాలయాల ద్వారా ప్రజలకు 55,672 సేవలు అందాయని, అయితే సేవల సరాసరి 84 నుంచి 50 శాతానికి పడిపోవడం దారుణమన్నారు. వెంటనే ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు దృష్టి సారించాలన్నారు. గూడూరు, ఎమ్మిగనూరు, దేవనకొండ మండలాల్లో తక్కువ సర్వీసులు అందాయన్నారు. గడువు దాటిన సమస్యలకు పరిష్కారం చూపకపోవడంపై దేవనకొండ తహసీల్దార్‌ను కలెక్టర్ వివరణ కోరగా సరైన సమాధానం రాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. హౌసింగ్‌కు సంబంధించి ప్రతి వారం పురోగతి కనిపించాలన్నారు. హొళగుంద, గూడూరు, హాలహర్వి మండలాల్లో ఇళ్ల నిర్మాణాలు చాలా వెనుకబడి పోయాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుల ఘర్షణ

- ఇద్దరికి కత్తిపోట్లు

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక నేషనల్ జూనియర్ కళాశాల భవనంలో మద్యం మత్తులో స్నేహితులు ఘర్షణ పడి ఇద్దరిని కత్తులతో పొడిచారు. టూటౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఉప్పరిపేటకు చెందిన కరీముల్లా, సలాముల్లా, అక్రమ్, యూనస్ వేర్వేరు ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఇంటికొచ్చిన వీరు సోమవారం స్థానిక నేషనల్ కళాశాల కాంప్లెక్స్ భవనంపై మద్యం సేవించారు. ఈ క్రమంలో అక్రమ్, యూనస్ మద్యం మత్తులో కరీముల్లా, సలాముల్లాతో ఘర్షణ పడి కత్తులతో పొడిచి పరారయ్యారు. స్థానికులు రక్తపు మడుగులో ఉన్న ఇద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

అదనపు విధులు తప్పించండి

- దేవదాయశాఖ కమిషనర్‌కు సహాయ కమిషనర్ లేఖ

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ గ్రేడ్- 3 ఈవో దినేష్‌కు ఉన్న అదనపు విధుల నుంచి తప్పించాలని ఆ శాఖ సహాయ కమిషనర్ ఆదిశేషు నాయుడు దేవదాయశాఖ కమిషనర్‌కు సిఫారసు చేశారు. ఎమ్మిగనూరు గ్రూప్ టెంపుల్స్‌కు రెగ్యులర్ ఈవోగా దినేష్ ఉన్నారు. గ్రేడ్-3 ఈవో అయిన ఈయన.. కర్నూలు-2, కర్నూలు - 3, మామిదాలపాడు గ్రూప్ టెంపుల్స్‌కు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఆలయాల్లోని ఆస్తుల అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం, ఉత్సవాల నిర్వహణలో లోపాలు ఉండటం, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అదనపు విధులు తొలగించి వేరే ఈవోలకు బాధ్యతలు అప్పగించాలని కమిషనర్‌కు ఆ శాఖ సహాయ కమిషనర్ లేఖ రాశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


మృతిచెందిన సురేష్

బొమ్మలసత్రం/పాణ్యం: జిల్లాలో సోమవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. నంద్యాల మండలం సుగాలిమెట్ట గ్రామసమీపంలో రహదారిపై బొలేరో వాహనం ఢీకొనడంతో బైక్‌పైవె వెళ్తున్న సురేష్ (27) అక్కడిక్కడే మృతిచెందగా, మునిచంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. మహానంది మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన సురేష్ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటి నిర్మాణం కోసం అవసరమయ్యే సామగ్రిని కొనుగోలు చేసేందుకు భవన నిర్మాణ కార్మికుడు మునిచంద్రతో కలిసి బైక్‌పై పట్టణానికి వచ్చాడు. సామగ్రి కొనుగోలు చేసిన అనంతరం గ్రామానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తాలుకా ఎస్ఐ నాగరాజు తెలిపారు.

తమ్మరాజుపల్లె వద్ద..


ప్రమాదానికి గురైన ఆటో

పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల పట్టణం క్రాంతినగర్‌కు చెందిన మాలా ఉసేన్(56) మృతి చెందాడు. రంజాన్ పండుగ ముగియడంతో కుటుంబ సభ్యులు 15 మంది కలిసి రెండు ఆటోల్లో ఓర్వకల్లు మండలంలోని రాక్‌గార్డెన్‌కు వెళ్లారు. అక్కడ ఆనందంగా గడిపి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసేందుకు వెళ్తున్నారు. అయితే తమ్మరాజుపల్లె వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఆటోను వెనకనుంచి ఢీకొట్టింది. అదే వేగంతో ఆటో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మాలా ఉసేన్, పాణ్యానికి చెందిన రేష్మా, ఉసేన్‌కు తీవ్రగాయాలయ్యాయి. అలాగే మరో నలుగురికి, బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులకు కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయడిన మాలాఉసేన్ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఆల్కలీస్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ ఆత్మహత్య

కర్నూలు: ఆల్కలీస్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ వెల్లంకి శేశావాలి ఫణిరాజు (47) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన కర్నూలులోని గణేష్ నగర్‌లో నివాసముంటాడు. భార్య జ్యోతిర్మయి రాజంపేటలో టీచర్. తల్లి సుజాతతో కలసి ఆమె రాజంపేటలోనే ఉంటోంది. దీంతో ఫణి రాజు కర్నూలులో ఒంటరిగా ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. సోమవారం మధ్యాహ్నం తల్లి సుజాత కొడుకు ఫణిరాజు కోసం ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో పక్కింట్లో బాడుగకు ఉన్న సౌజన్య, కరుణాచారి దంపతులకు ఫోన్ చేసింది. తన కుమారుడు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని.. కొద్దిగా సమాచారం ఇవ్వండంటూ కోరింది. వాళ్లు ఇంట్లోకి తొంగి చూడగా ఫణిరాజు ఫ్యాన్‌కు వెలాడుతూ కనిపించాడు. విషయం మూడవ పట్టణ పోలీసులకు తెలియడంతో బ్లూ కోల్ట్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియవని పోలీసులు తెలిపారు.

జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్‌గా ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి


జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్‌గా ఎన్నికైన ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్‌గా ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సభ్యులుగా 27 మందిని జిల్లా కలెక్టర్ సృజన నియమించారు. ఇందులో 15 మంది కార్యనిర్వాహక సభ్యులుగా ఉంటారు. వీరంతా చైర్మన్‌గా ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. చైర్మన్ స్థానానికి ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడం విశేషం. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి హేమంత్‌కుమార్ ప్రకటించారు. వెంటనే చైర్మన్‌తో పదవీ ప్రమాణ స్వీకారం కూడా చేయించారు. ఈ పదవీలో ఆయన ఐదేళ్ల పాటు కొనసాగుతారు. ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విజయ డెయిరీలో అనేక మార్పులు తీసుకొచ్చి లాభాల బాట పట్టిచ్చామని, అదే తరహాలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చేపడుతున్న కార్యక్రమాలను రైతుల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేస్తామన్నారు. కృత్రిమ గర్భధారణతో నాటు పశువుల ద్వారానే మేలు జాతి పశువులను అభివృద్ధి చేసుకోవచ్చని, దీనిపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. లింగ నిర్ధారిత వీర్యంతో పెయ్య దూడలే ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. నూతన చైర్మన్‌ను జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి రాజశేఖర్,ఏడీ మల్లన్న, విజయ డెయిరీ డీడీ రాజేష్, కర్నూలు డెయిరీ మేనేజర్ ఎస్.విజయకుమార్ తదితరులు అభినందించారు.

విద్యార్థి మృతి ఘటనలో ముగ్గురిపై వేటు

- జూపాడుబంగ్లా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ మాస్టర్, పీఈటీ సస్పెన్షన్
- పీడీ డీసీఓకు సరెండర్, పార్టుటైం హిందీ మాస్టర్ తొలగింపు

జూపాడుబంగ్లా: స్థానిక గురుకులం విద్యార్థి ఎం.నగేష్ మృతికి బాధ్యులైన వారిపై సాంఘిక సంక్షేమశాఖ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల సెక్రటరీ పవన్‌కుమార్ కొరడా ఝులిపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.రాజు, హౌస్‌మాస్టర్ ఏసేపు, పీఈటీ లక్ష్మీకాంతారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్ట్‌టైం హిందీ మాస్టర్ పార్థసారథి, ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విధుల్లోంచి తొలగించారు. పీడీ గంగాధర్ డీసీఓకు సరెండర్ చేశారు. విద్యార్థి మృతికి గల కారణాలపై నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి, డీసీఓ శ్రీదేవి, టెక్నికల్ డిప్యూటీ సెక్రెటరీ యోగేశ్వరరావు సోమవారం గురుకుల పాఠశాలకు చేరుకొని పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ మాస్టర్, పీఈటీ, పీడీ, సెక్యూరిటీ గార్డులు, విద్యార్థులను ఉదయం నుంచి సాయంత్రం దాకా సమగ్రంగా విచారించి నగేష్ మృతికి గలకారణాలపై ఆరా తీశారు. విద్యార్థి మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక తయారుచేసి కలెక్టర్ మనజీర్‌జిలానీ శ్యామూన్, సెక్రటరీ పవన్‌కుమార్‌కు పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే మృతుడి తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్, వార్డెన్, హౌస్ మాస్టర్, ఫిజికల్ డైరెక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ తెలిపారు. గురుకుల పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, సీపీఐ నాయకుడు రమేష్, విద్యార్థి సంఘం నాయకులు అధికారులను కోరారు.

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమా?

నగేష్ మృతి చెందిన బావి యజమాని నెలరోజుల క్రితమే పాఠశాలకు చేరుకుని విద్యార్థులు ఈత కొట్టేందుకు వస్తున్నారని, కట్టడి చేయాలని, గతంలో ఇద్దరు మృతి చెందారనే విషయం ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.

రోగ నిర్ధారణ పరీక్షలు ఆసుపత్రిలోనే చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోగులకు అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్‌ను లోకాయుక్త ఆదేశించింది. ఆసుపత్రికి వచ్చే పేదలు, మధ్యతరగతి ప్రజలను కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌లు మోసపూరితంగా తమ ఏజెంట్ల ద్వారా ప్రైవేట్ ల్యాబ్‌లకు తీసుకెళ్లి డబ్బులు గుంజుతున్నారనే ఆరోపణలపై సోమవారం లోకాయుక్త సుమోటోగా విచారణకు స్వీకరించి ఈమేరకు ఆదేశాలు ఇచ్చింది.

సమస్యలపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని ఆశాఖ అధికారులను దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. సోమవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది పనిచేసే ప్రాంతంలో నివాసం ఉంటే ఫిర్యాదులు తగ్గుతాయన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు


బ్రిగేడియర్ సోమశేఖర్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ సైనికుల సంక్షేమ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలో మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆంధ్ర, తెలంగాణ డిప్యూటీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ బ్రిగేడియర్ కె.సోమశేఖర్ తెలిపారు. మాజీ సైనికులు, వారి కుటుంబాల సమస్యలను తెలుసుకునేందుకు ఆయన సోమవారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ రమేష్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నర్రా పేరయ్య చౌదరి, కార్యదర్శి ఎం సుధాకర్ ఘనంగా స్వాగతం పలికారు. మాజీ సైనికులకు ఎంప్లాయ్‌మెంట్, హాస్పిటల్ లేదని, సైనిక సంక్షేమ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. సమస్యలన్నింటినీ తెలుసుకున్న ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఏటీఎం కార్డు మార్చి మోసం

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ఏటీఎం కేంద్రంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి రాక ఇబ్బంది పడుతుంటే అక్కడే ఉన్న అపరిచితుడు డ్రా చేసి ఇస్తానని చెప్పి ఏటీఎం కార్డు మార్చేసి మోసం చేశాడని కల్లూరుకు చెందిన లక్ష్మన్న ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 72 ఫిర్యాదులు వచ్చాయి.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కొడుకు, కోడలు కలసి బయటకు గెంటేసేందుకు పది రోజులుగా తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని , తనకు న్యాయం చేయాలని కల్లూరు మండలం ముజఫర్‌నగర్‌కు చెందిన బేగ్ కోరారు.
- భర్త చనిపోయాడని, వారసత్వంగా ఆయనకు వచ్చిన ఆస్తిభాగం ఇవ్వకుండా మరిది ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కల్లూరు మండలం శరీన్‌నగర్‌కు చెందిన రాజేశ్వరి ఫిర్యాదు చేశారు.
- కొందరు వ్యక్తులు తమ పెట్రోల్ బంకు కాంపౌండ్ వాల్ పగులగొట్టారని, విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పెద్దటేకూరుకు చెందిన మల్లికార్జున చౌదరి కోరారు.
- గురుకుల పాఠశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన జ్యోతిర్మయి ఫిర్యాదు చేశారు.
- ఎస్ఎల్‌సీ గ్లోబల్ ఇండియా లిమిటెడ్ ఫారెక్స్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందని నమ్మించి కొందరు తనను మోసం చేశారని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన రామకృష్ణ కోరారు.
- స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ వెంకటాద్రి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో పెళ్లి చేసుకొని మోసం చేశాడు!

- భర్తను ఉద్యోగం నుంచి తొలగించాలని భార్య ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్న తన భర్త రాకేశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని సచివాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శిగా పని చేస్తున్న ఏ.గాయత్రి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె కలెక్టర్ డాక్టర్ జి. సృజనకు వినతిపత్రం ఇచ్చారు. ఈ అర్జీపై సత్వరంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం గాయత్రి కర్నూలు మండలం గార్గేయపురం సచివాలయంలో పనిచేస్తున్నారు. ఆమె గతంలో హాలహర్విలో పనిచేస్తున్న సమయంలో అక్కడే ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాకేష్‌బాబుతో వివాహమైంది. వీరికి ఒక పాప కూడా పుట్టింది. తరువాత రాకేష్‌బాబు లక్ష్మీ అనే మరో ఉద్యోగిని వివాహం చేసుకున్నారు. దీంతో ఆమె కర్నూలు త్రీటౌన్‌లో ఆరు నెలల కింద కేసు పెట్టారు. తరువాత ఆమె తన బిడ్డ పోషణపై హైకోర్టుకు కూడా వెళ్లారు.